


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక :53 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు మంగళవారం 29 అక్టోబర్ 2024 వెల : 5/-రూ॥
VOLUME :11 ISSUE : 53 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE TUE 29 OCTOBER 2024 PRICE : 5/- RS
Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur

## ఏపీలో శాప్ నెట్ మూసివేత



- ఈ మేరకు ఏపీ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ
- 2018లో శాప్ నెట్‌ను ఏర్పాటు చేసిన టీడీపీ సర్కార్
- ఈ కార్యక్రమంలో భాగంగా మన టీవీ ద్వారా విద్యారంగానికి సేవలు

పెన్ పవర్ డెస్క్: ఏపీ ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. సొసైటీ ఫర్ ఏపీ నెట్‌వర్క్ (శాప్ నెట్)ను మూసివేసింది. ఈ మేరకు ఏపీ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించిన ఆస్తులు, సిబ్బంది, అప్పులను ఉన్నత విద్యా మండలికి బదలాయించింది. కాగా, 2018లో శాప్ నెట్‌ను అప్పటి టీడీపీ సర్కార్ ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో భాగంగా మన టీవీ ద్వారా విద్యారంగానికి సేవలు అందించింది. ఇప్పుడు ఈ విభాగాన్ని మూసివేసి, నేరుగా విద్యామండలి నుంచే సమర్థవంతంగా సేవలందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.

# ఆడబిడ్డ కన్నీరు ఆ ఇంటికి అరిష్టం

- వైఎస్ కుటుంబం ఆస్తుల కోసం తగదాలు పడటం బాధాకరం: మాజీ మంత్రి బాలినేని
- జగన్, షర్మిల మధ్య ఆస్తుల వివాదంపై స్పందించిన బాలినేని
- ఆడబిడ్డ కన్నీరు ఆ ఇంటికి అరిష్టమని వ్యాఖ్య
- సమస్య పరిష్కారం కోసం వైఎస్ విజయమ్మ ముందుకు రావాలని సూచన
- వేరే వాళ్లు దీనిలో జోక్యం చేసుకోవద్దన్న బాలినేని



పెన్ పవర్ డెస్క్: మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి, ఆయన సోదరి, ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల మధ్య ఆస్తుల వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాస్‌రెడ్డి తాజాగా స్పందించారు. వైఎస్ కుటుంబం ఆస్తుల కోసం తగదాలు పడటం బాధాకరమని అన్నారు. ఆడబిడ్డ కన్నీరు ఆ ఇంటికి అరిష్టమని పేర్కొన్నా రు. ఈ సమస్య పరిష్కారం కోసం వైఎస్ విజయమ్మ ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. వేరే వాళ్లు దీనిలో జోక్యం చేసుకోవద్దని బాలినేని కోరారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. తాను ఏ పార్టీలో ఉన్నా వైఎస్ కుటుంబం బాగుండాలని కోరుకుంటానని చెప్పారు.ఆస్తులు సంపాదించుకుని పార్టీ మారినట్టు తనపై కొందరు వైసీపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని బాలినేని మండిపడ్డారు. వైసీపీలో ఉన్నప్పుడు తన ఆస్తులు పోగొట్టుకున్నాను తప్పితే, సంపాదించుకోలేదని తన కుమారుడి సాక్షిగా చెప్పారు. తన తండ్రి, కోడలి ఆస్తి అమ్మి తాను చేసిన అప్పులను తీర్చినట్టు తెలిపారు. ఈ విషయం జగన్‌కు కూడా తెలుసని పేర్కొన్నారు.జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసినప్పుడు ఎన్నికలకు ముందే పార్టీలోకి తీసుకుందామనుకున్నట్టు చెప్పారని గుర్తు చేశారు. కానీ జగన్‌కు బంధువు కావడంతో అడగలేకపోయానని పవన్ తనతో చెప్పినట్లు బాలినేని తెలిపారు. ఆయన హుందాగా మాట్లాడటం తనకు నచ్చిందన్నారు. ఇక మంత్రి పదవి వదులుకుని జగన్ వెంట నడిస్తే.. ఆ పార్టీలో తనకు ఏం జరిగిందో ప్రజలకు తెలుసునని బాలినేని పేర్కొన్నారు.



## జగన్ చేయి పట్టుకున్నోళ్లంతా పాతాళంలోకే

- తల్లి, చెల్లిపై కేసులేయడంతో జగన్ పాతాళంలో పడిపోయారన్న యనమల
- చివరికి జగన్ తన సొంత తల్లి, చెల్లిని కూడా మోసం చేశారని విమర్శ
- భవిష్యత్తులో జగన్ మళ్లీ అధికారంలోకి రావడమనేది పగటి కలేనని చురక
- కాకపోతే రేపైనా జగన్ జైలుకెళ్లడం ఖాయమని జోస్యం

పెన్ పవర్ డెస్క్: తల్లి, చెల్లిపై కేసులేయడంతో మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాతాళంలోకి పడిపోయారని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు విమర్శించారు. ఆయన చేయి పట్టుకున్నోళ్లంతా పాతాళంలోకే అని ఎద్దేవా చేశారు. చివరికి జగన్ తన సొంత తల్లి, చెల్లిని కూడా మోసం చేశారని దుయ్యబట్టారు. ఇది ఆస్తుల వివాదం కాదని, రాజకీయ ఆత్మహత్యేనని యనమల పేర్కొన్నారు. షర్మిలకు రూ. 200 కోట్లు ఇచ్చానని జగన్ చెప్పినా...

వివరాలు 2లో..

## ఈ పరిశ్రమ ఏర్పాటుతో రతన్ టాటా ఆత్మ సంతోషిస్తుంది

- దేశ రక్షణ రంగంలో కీలక ఘట్టం
- ఇకపై దేశీయంగానే సైనిక రవాణా విమానాల తయారీ
- ఎయిర్ బస్ సహకారంతో పరిశ్రమ ఏర్పాటు చేసిన టాటా సన్స్

వివరాలు 2లో..




### అమెరికాలో మంత్రి లోకేశ్ పర్యటన..

## టెస్లా, పెరోట్ గ్రూప్ ప్రతినిధులతో భేటీ

**పెరోట్ గ్రూప్ చైర్మన్ రాస్ పెరోట్ జూనియర్‌తో మంత్రి లోకేశ్ బృందం..**

పెన్ పవర్ డెస్క్: ఏపీ మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటన కొనసాగు తోంది. పెరోట్, టెస్లా సంస్థల ప్రతినిధులతో మంత్రి సమావేశమ య్యారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆయా సంస్థలను ఆహ్వానించారు. పెరోట్ గ్రూప్ అండ్ హిల్‌వుడ్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ రాస్ పెరోట్ జూనియర్‌తో లోకేశ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఏవియేషన్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు.

వివరాలు 2లో..



## ఏపీఎండీసీ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు



- గత ప్రభుత్వంలో అక్రమాలు జరిగాయని భావిస్తున్న కూటమి సర్కారు
- విచారణ ముమ్మరం
- ఇప్పటికే గనుల శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి అరెస్ట్
- వెంకటరెడ్డి నుంచి సేకరించిన సమాచారంతో నేడు తనిఖీలు

వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్: గత ప్రభుత్వ హయాంలో అనేక శాఖల్లో అక్రమాలు జరిగాయని భావిస్తున్న ఏపీ ప్రభుత్వం... ఈ మేరకు విచారణ ముమ్మరం చేసింది. ఈ క్రమంలో ఏసీబీ నేడు ఏపీఎండీసీ కార్యాలయంలో తనిఖీలు చేపట్టింది. గనుల శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి కేసులో

## పార్టీలకతీతంగా ప్రజా సమస్యల పరిష్కారం

పెన్ పవర్ డెస్క్: పార్టీలకతీతంగా ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలంలో నిర్వహించిన ప్రజా వేదికలో పాల్గొన్న ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కౌంటర్లను అధికారులు ఏర్పాటు చేశారు.

వివరాలు 2లో..



## జగన్ తన పదవీకాలమంతా వసూళ్లతోనే గడిపారు

- వైఎస్ఆర్‌పై ఎక్స్ వేదికగా వైసీపీ పోస్ట్
- దానిపై ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మాణికం ఠాగూర్ ఘాటు స్పందన
- జగన్ సీఎంగా ఉన్నప్పుడు ధనవంతుల్నే కలిసేవారని వ్యాఖ్య
- నిజానికి జగన్ ఎప్పుడూ వైఎస్‌ను అనుసరించలేదని విమర్శ



వివరాలు 2లో..

## మెగాస్టార్ చిరంజీవికి ఏఎన్నార్ నేషనల్ అవార్డ్..

- ఏఎన్ఆర్ జాతీయ అవార్డు అందుకున్న చిరంజీవి... అమితాబ్ పాదాలకు నమస్కారం
- అవార్డును ప్రదానం చేసిన అమితాబ్ బచ్చన్
- మెగాస్టార్‌ను దగ్గరకు తీసుకొని ఆలింగనం చేసుకున్న అమితాబ్
- చిరంజీవికి శాలువా కప్పిన అమితాబ్



పెన్ పవర్ డెస్క్: మెగాస్టార్ చిరంజీవి బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ చేతులమీదుగా ఏఎన్ఆర్ జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. 2024 సంవత్సరానికి గాను ఈ అవార్డును చిరంజీవికి ప్రకటించారు. అన్నపూర్ణ స్టూడియోలో ఈరోజు జరిగిన అక్కినేని జాతీయ పురస్కార వేడుకకు అమితాబ్ బచ్చన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఎన్ఆర్ జాతీయ పురస్కారాన్ని అమితాబ్... చిరంజీవికి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చిరంజీవికి శాలువా కప్పి సన్మానించారు. మెగాస్టార్‌ను అమితాబ్ దగ్గరకు తీసుకొని ఆలింగనం చేసుకున్నారు. చిరంజీవి మర్యాదపూర్వకంగా అమితాబ్ బచ్చన్ పాదాలకు నమస్కరించారు.ఈ కార్యక్రమానికి చిరంజీవి కుటుంబ సభ్యులు,

వివరాలు 2లో..

## విద్యుత్ చార్జీల గురించి జగన్ మాట్లాడడం విడ్డూరంగా ఉంది



- గత ప్రభుత్వం 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచిందన్న పార్థసారథి
- జగన్ అనాలోచిత నిర్ణయాలు తీసుకున్నారని విమర్శలు
- అందుకే రూ.6,072 కోట్ల ట్రూ అప్ భారం పడిందని వెల్లడి

వివరాలు 2లో..

## రాజకీయ వర్గాల్లో కూడా న్యాయవ్యవస్థ పట్ల ఎంతో గౌరవం ఉంది

- రిటైర్‌మెంట్ కు కొన్ని రోజుల ముందు సుప్రీం సీజే ఆసక్తికర వ్యాఖ్యలు
- గణేశ్ పూజ కోసం ప్రధాని మోదీ తన నివాసానికి రావడంపై మాట్లాడిన చంద్రచూడ్
- అలాంటి సమావేశాలలో న్యాయపరమైన విషయాలే చర్చించబోమని వెల్లడి

పెన్ పవర్ డెస్క్: గత నెలలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నివాసంలో జరిగిన గణేశ్ పూజకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా హాజరుకావడం తీవ్ర రాజకీయ దుమారాన్ని రేపిన విషయం తెలిసిందే. ఆ వివాదంపై రిటైర్‌మెంట్‌కు కొన్ని రోజుల

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# బిలినియర్ల రాజ్యంగా భారత్

ఆర్థిక అభివృద్ధిలో 10 సంవత్సరాల పాలనాకాలం అంటే పెట్టుబడులు పెట్టే కాలానికీ, ఫలాలు అందుకునే కాలానికీ మధ్యగల కాలం. పదేళ్లు అంటే చాలా ఎక్కువే. ఈ పథకాన్ని ప్రారంభించిన పాలకులు పదేళ్లుగా వారే అధికారంలో ఉండటం గమనార్హం. కానీ అభివృద్ధి మంత్రంగా స్వదేశీ ఉద్యమంగా చేపట్టిన మేకిన్ ఇండియా పథకం దేశంలో వివిధ రంగాల అభివృద్ధి స్థాయిని పెంచలేకపోయింది. ఈ పథకం పురోగమనానికి అనేక రంగాల అల్పాభివృద్ధి అవరోధాలే కారణమని అంటున్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో అల్పాభివృద్ధి, యువతకు సాంకేతిక రంగంలో పరిజ్ఞానం లేకపోవడం, విద్యుత్ రవాణా రంగాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి లేకపోవడం ఒకవైపు మేకిన్ ఇండియా పురోగమనానికి అవరోధాలుగా ఉన్నాయి. దేశంలో కావలసిన అవస్థాపన వసతులు ఉంటే తప్ప పెట్టుబడిదారులకు ముందుగా పెట్టుబడులు పెట్టలేరు. మేక్ ఇన్ ఇండియా పథకం ఉద్యోగతను కల్పించే బదులుగా నిరుద్యోగితను పెంపొందించింది. పారిశ్రామికీకరణకు బదులుగా పారిశ్రామిక పతనానికి దారితీసింది.ఆనాడు మహాత్మా గాంధీ బ్రిటిష్ పారిశ్రామికవేత్తల ఉత్పత్తులకు వ్యతిరేకంగా స్వదేశీ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు చేపట్టిన స్వదేశీ ఉద్యమం నేడు మన ప్రధానమంత్రి చేపట్టిన మేక్ ఇన్ ఇండియా రెండూ ఒక్కటేనా? గాంధీజీ ప్రకారం పెట్టుబడి దారీ వ్యవస్థ నిరుద్యోగాన్ని నిర్మూలించలేదు. పరిపాలనా విధానా లు, చట్టాల ద్వారా అందరికీ క్షేమం అందించేదే రాజ్యం. అటు రాచరిక వ్యవస్థకు ఇటు కమ్యూనిస్టు వ్యవస్థకు మధ్య మార్గమే ఇప్పటి ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ. ఇది ఆయా దేశాల జాతీయ వాదానికి సంబంధించిన వాదన. దేశ జాతీయవాదం ప్రజల కోసం ఉండాలి గాని పెట్టుబడిదారుల లాభాల కోసం కాకూడదని గాంధీజీ అభిప్రాయ పడ్డారు. మనదేశంలో 1920 శతాబ్దంలో ఏర్పడిన జాతీయవాదం దేశ స్వాతంత్రం కోసం అన్ని కులాలను మతాలను కలుపుకొని వలస పాలనకు వ్యతిరేకంగా ఆవిర్భవించింది. మాకు బ్రిటిష్ ప్రజలతో ఎటువంటి వ్యతిరేకత లేదు. బ్రిటిష్ పెట్టుబడిదారులతోనే వారి పెట్టుబడుల వలన మా దేశంలో ఆర్థిక వ్యవస్థలో నిరుద్యోగం పేదరికం ఏర్పడుతుందని మహాత్మా గాంధీ అన్నారుఇంగ్లాండులో పారిశ్రామిక విప్లవంతో పెట్టుబడుల్లో, ఉత్పత్తిలో పెరుగుతున్నాయి గానీ ఆదాయ అసమానతలు తగ్గలేదు. 1890లో గాంధీ లండన్ విశ్వవిద్యాలయంలో లా డిగ్రీ చదివేటప్పుడు ఈ విషయాన్ని స్వయంగా గమనించి వివరించారు. వలస పాలకు లు మనదేశంలో వసూలు చేసిందల్లా సముద్రాల్ని దాటించి పారిశ్రామిక విప్లవం ఇంగ్లాండ్‌లో జరిగేటట్టుగా చూసుకున్నారు. మనదేశంలో ఆదాయాలు తగ్గి నిరుద్యోగం పెరిగింది. పెట్టుబడిదారీ విధానం చిన్న చిన్న ఉత్పత్తిదారులను నిర్వీర్యం చేసి నిరుద్యోగం పెరిగేటట్లు చేస్తుందని గాంధీజీ అభిప్రా యం. ఈ క్రమంలోనే 1920లో బ్రిటిష్ పెట్టుబడిదారులను వ్యతిరేకించిన భారతీయ పెట్టుబడిదారులు తర్వాత బ్రిటిష్ పెట్టుబడిదారులతోనే లాలూచీ పడ్డారు. అందుకే స్వదేశీ విదేశీ ఫైనాన్స్ పెట్టుబడిదారుల చారిత్రక నేపథ్యం తెలుసుకోకుండా, వారి స్వలాభాపేక్షతో కూడిన జాతీయవాదాన్ని అర్థం చేసుకోకుండా మన ఆర్థిక వ్యవస్థను పెట్టుబడిదారులకు అప్పగించడం ఎంతవరకు సమంజసమో..? ప్రస్తుత పాలకులు ఆలోచించాలి. తాము ప్రభుత్వాన్ని నడిపిస్తున్నది ప్రజల కోసమా? పెట్టుబడిదారుల కోసమా? అనే ప్రశ్న వేసుకోవాలి. రోజురోజుకు ప్రస్తుత పాలకులు గాంధీజీ ఆర్థిక విధానాలకు ఎంత దూరం అవుతున్నారో గమనించాలి.2014 సెప్టెంబర్ 25న ప్రారంభించిన మేకిన్ ఇండియా పథకం ద్వారా ఉత్పత్తి రంగంలో పెట్టుబడులను పెంచి తద్వారా దేశంలో పరిశ్రమల సామర్థ్యాన్ని పెంచాలని మౌలిక వసతులను కల్పించాలని ఉద్యోగతను పెంచాలని, అందుకోసం 25 ప్రధాన రంగాలను ఎంపిక చేసి వాటిలో పెద్ద సంఖ్యలో పెట్టుబడులను పెట్టేందుకు స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులను ఆహ్వానించి దేశంలో పారిశ్రామికీకరణ స్వదేశీయతతో కూడుకున్నదిగా అభివృద్ధి చేయాలని మన ప్రధానమంత్రి బాధ్యతలను చేపట్టిన తొలి రోజుల్లోనే కోరుకున్నారు. పది వసంతాలు పూర్తయినాయి. 2014 నుంచి 2023 వరకు ఎఫ్‌డీఐలలో 900 బిలియన్ డాలర్లు వచ్చాయి. ఆటో మొబైల్ రంగంలో పురోగతి ఫార్మాసూటికల్ రంగంలో గ్లోబల్ హబ్‌గా మారడం ఎలక్ట్రానిక్ పరిశ్రమ పురోగతి రక్షణ రంగంలో కూడా స్వావలంబన దిశగా అడుగులు వేయడం జరిగింది. అయినప్పటికీ దేశంలో పారిశ్రామికీకరణకు అవసరమైన మౌలిక వసతులు విద్యుత్, నీటి సౌకర్యాలు లేవని పెట్టుబడుల ప్రవాహం అక్కడికక్కడ అంతంత మాత్రంగానే సాగింది. దేశంలో పారిశ్రామిక రంగం తిరోగమనంలో పడింది అంటే డి ఇండస్ట్రియలైజేషన్ జరుగుతుందని చెప్పాలి. ఆనాడు గాంధీజీ స్వదేశీ ఉద్యమాన్ని చేపట్టి దేశంలో స్వదేశీ పరమైన పారిశ్రామికీకరణ జరగాలని విదేశీ వస్త్రాలను బహిష్కరించాలని, స్వదేశంలో ఉపాధిని పెంపొందించాలని కోరుకోవడం మన పాలకులు మరిచినట్టు ఉన్నారు. కానీ పెట్టుబడిదారుల కనుసన్నల్లో ఉన్న మేకిన్ ఇండియా పథకం ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదు. స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులపై ఆధారపడిన మేకిన్ ఇండియా పథకం తిరోగమనంలోకి పోయింది. ఫలితంగా పారిశ్రామిక ఉత్పత్తుల వాటా మన స్థూల జాతీయోత్పత్తిలో పెరుగుదల లేకుండా పోయింది. దేశంలో పరిశ్రమలు నిర్వీర్యమై పారిశ్రామిక రంగం పతనమైంది.మేక్ ఇన్ ఇండియా పథకం ఉద్యోగతను కల్పించే బదులుగా నిరుద్యోగితను పెంపొందించింది. పారిశ్రామికీకరణకు బదులుగా పారిశ్రామిక పతనానికి దారితీసింది. విదేశీ స్వదేశీ పెట్టుబడిదారులను నమ్ముకుని కార్పొరేట్ రంగానికి బలోపేతం చేసి చిన్న తరహా మధ్య తరహా పరిశ్రమలను నిర్వీర్యం చేయడం వలన ఉద్యోగిత, డిమాండ్, పెట్టుబడులలో ఆర్థిక వ్యవస్థలో తగ్గిపోయి ప్రజల కొనుగోలు శక్తి నిర్వీర్యమైంది. ఫలితంగా 2024లో ఆకలి సూచికలో 127 దేశాలలో మన దేశం 105వదిగా మిగిలింది. కొనుగోలు శక్తి లేక ప్రజలు దేశంలో ఉన్నారని తెలుస్తుంది. 2022లో ప్రచురించిన వరల్డ్ ఇన్ క్వాలిటీ రిపోర్ట్ ప్రకారం మన దేశంలో సంపన్నులు ఒక శాతం దగ్గర 40 శాతం పైగా సంపద ఉన్నది. బిలినియర్ల రాజ్యంగా భారత్ మారుతున్నదని ఈ నివేదిక తెలియజేస్తున్నది. మేక్ ఇన్ ఇండియా స్వదేశీ ఉత్పత్తుల ఉద్యమంగా ప్రారంభించి 10 సంవత్సరాలైనా ఉద్యోగిత కానీ ఆదాయాలు కానీ పెరగక దేశ ప్రజలకు నిరాశ మిగిలింది.

# రాజకీయ వర్గాల్లో కూడా న్యాయవ్యవస్థ పట్ల ఎంతో గౌరవం ఉంది

- మొదటి పేజీ తరువాయి

ముందు జస్టిస్ చంద్రచూడ్ స్పందించారు. అలాంటి సమావేశాలలో న్యాయపరమైన విషయాలేవీ చర్చించబోమని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ వ్యవస్థలో చాలా పరిణతి ఉందని, ఇలాంటి సమావేశాల సమయంలో పెండింగ్ కేసుల గురించి రాజకీయ నేతలు ఎప్పుడూ అడగరని ఆయన పేర్కొన్నారు. "నేను గతంలో అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేశాను. కొత్త ప్రధాన న్యాయమూర్తిని నియమించాక సీఎం ఇంటికి వెళ్లేవారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి కూడా చీఫ్ జస్టిస్ ఇంటికి వెళ్లేవారు. సమావేశాల ఎజెండాను నిర్ణయించేవారు. రాష్ట్రంలో 10 ప్రాజెక్టులు జరుగుతున్నాయని అనుకుందాం.. ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ బడ్జెట్ ఎంత? అనే ప్రాధాన్యతలను ముఖ్యమంత్రి తెలిపేవారు. భేటీ కాకుండా లేఖల ద్వారా ఈ వివరాలు తెలుసుకోవాలనుకుంటే అది అయ్యే పని కాదు.అంతేకాదు, న్యాయవ్యవస్థ బడ్జెట్ రాష్ట్రం నుంచే వస్తుంది. కానీ ఈ బడ్జెట్ జడ్జిల కోసం కాదు. జిల్లాల్లో కొత్త కోర్టు భవనాలు, న్యాయమూర్తులకు కొత్త నివాసాలు కావాలి. ఇలాంటి వాటి కోసం ప్రధాన న్యాయమూర్తి – ముఖ్యమంత్రి సమావేశాలు కావడం అవసరం... ఈ సమావేశాల్లో కేసుల ప్రసక్తి రాదు" అని సీజే డీవై చంద్రచూడ్ అన్నారు. ఆగస్టు 14, జనవరి 26, పెళ్లి లేదా సంతాప వేదికలలో ముఖ్యమంత్రి, చీఫ్ జస్టిస్ ఒకరినొకరు కేవలం కలుసుంటారంతే, జుడీషియల్ వ్యవహారాలేమీ అక్కడ చర్చకు రావని ఆయన క్లారిటీ ఇచ్చారు. 'లోక్‌సత్తా' వార్షిక ఉపన్యాసంలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రాల ముఖ్యమంత్రులు, హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు క్రమం తప్పకుండా

సమావేశాలు కావడం ఒక ఆనవాయతీ అని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఈ భేటీలు ఎందుకని జనాలు భావిస్తున్నారని, కానీ రాజకీయ వర్గాల్లో కూడా న్యాయవ్యవస్థ పట్ల అపారమైన గౌరవం ఉందని, ఈ విషయంలోనే మన రాజకీయ వ్యవస్థ పరిపక్వత దాగి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

### అమెరికాలో మంత్రి లోకేశ్ పర్యటన..

# టెస్లా, పెరోట్ గ్రూప్ ప్రతినిధులతో భేటీ

- మొదటి పేజీ తరువాయి

అలయెన్స్ టెక్సాస్ తరహా ప్రాజెక్టులకు ఏపీ తీరప్రాంతం అనుకూలమని ఆయనకు వివరించారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో రాష్ట్రంలో పోర్టులు, హైవేలు, పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. దీనిపై రాస్ పెరోట్ సానుకూలంగా స్పందించారు.

**అనంతపురంలో 'టెస్లా' యూనిట్లు ఏర్పాటు చేయండి..**

మరోవైపు ఎలక్ట్రిక్ వాహనాల తయారీ రంగంలో అగ్రగామిగా ఉన్న 'టెస్లా' సంస్థ సీఎఫ్‌వో వైభవ్ తనేజాతోనూ లోకేశ్ భేటీ అయ్యారు. ఆస్టిన్‌లోని టెస్లా కేంద్ర కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీల తయారీ యూనిట్ల ఏర్పాటుకు అనంతపురం జిల్లా వ్యూహాత్మక ప్రదేశంగా ఉంటుందని వివరించారు. 2029 నాటికి ఏపీలో 72 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన విద్యుదుత్పత్తిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. దీనికి టెస్లా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఎలక్ట్రిక్ వాహనాలు, క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్, బ్యాటరీ స్టోరేజీలో టెస్లా గ్లోబల్ లీడర్‌గా ఉందని వైభవ్ తనేజా తెలిపారు. రాష్ట్రంలో సౌరశక్తి వ్యవస్థలు, స్మార్ట్‌సిటీలు, గ్రామీణ విద్యుదీకరణకు సౌర ఫలకాల అమర్చడంలో భాగస్వామ్యం కావాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఈవీ ఛార్జింగ్ నెట్‌వర్క్ అభివృద్ధి, సూపర్ ఛార్జింగ్ టెక్నాలజీ అమల్లోనూ పాలుపంచుకోవాలని కోరారు. రాష్ట్రంలో టెక్నాలజీ పార్కులు ఏర్పాటు చేయాలని టెస్లా సీఎఫ్‌వోకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

### ఏపీఎండీసీ కార్యాలయంలో

# ఏసీబీ తనిఖీలు

- మొదటి పేజీ తరువాయి

ఏసీబీ ఈ తనిఖీలు నిర్వహించింది.

వెంకటరెడ్డి ఇప్పటికే ఇసుక టెండర్ల వ్యవహారంలో అరెస్ట్ అయ్యారు. ఆయన ప్రస్తుతం విజయవాడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఇటీవల ఏసీబీ అధికారులు వెంకటరెడ్డిని కస్టడీలోకి తీసుకుని విచారించారు. ఆయన ఇచ్చిన సమాచారంతోనే నేడు ఏసీబీ అధికారులు ఏపీఎండీసీ కార్యాలయంలో సోదాలు చేపట్టారు.

## మెగాస్టార్ చిరంజీవికి ఏఎన్నార్ నేషనల్ అవార్డ్..

- మొదటి పేజీ తరువాయి

నాగార్జున కుటుంబ సభ్యులతో పాటు సినీ రంగానికి చెందిన పలువురు హాజరయ్యారు. తన తండ్రి అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా నాగార్జున ఈ అవార్డును ప్రకటించారు.

### ఈ పరిశ్రమ ఏర్పాటుతో రతన్

# టాటా ఆత్మ సంతోషిస్తుంది

**పెన్ పవర్ డెస్క్:** గత కొన్ని సంవత్సరాలుగా భారత్ స్వావలంబన కోసం శ్రమిస్తోంది. ముఖ్యంగా, రక్షణ రంగంలో ఇతర దేశాలపై ఆధారపడడాన్ని గణనీయంగా తగ్గించాలన్న కృషితో, ఆయుధాలు, రక్షణ రంగ పరికరాలను దేశీయంగా తయారుచేయడంపై దృష్టి సారించింది.ఈ క్రమంలో దేశ రక్షణ రంగ ఉత్పాదన పరిశ్రమలో నేడు కీలక ఘట్టం చోటుచేసుకుంది. గుజరాత్ లోని వడోదరలో మిలిటరీ రవాణా విమానాల ఉత్పత్తి పరిశ్రమ ప్రారంభమైంది. స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో శాంచెజ్ తో కలిసి ప్రధాని నరేంద్ర మోదీ ఈ పరిశ్రమను ప్రారంభించారు. ఈ మిలిటరీ కార్గో విమానాల పరిశ్రమను ఎయిర్ బస్ సంస్థ సహకారంతో టాటా సన్స్ సంస్థ నెలకొల్పింది.

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, రతన్ టాటా ఉంటే ఈ కార్యక్రమం చూసి ఎంతో సంతోషించేవారని, ఈ పరిశ్రమ ఏర్పాటుతో రతన్ టాటా ఆత్మ సంతోషిస్తుందని వ్యాఖ్యానించారు. ఈ పరిశ్రమంతో మేకిన్ ఇండియా, మేక్ ఫర్ ద వరల్డ్ కార్యాచరణ మరింత దృఢతరం అవుతుందని పేర్కొన్నారు.

ఇక్కడ తయారైన సైనిక రవాణా విమానాలను విదేశాలకు ఎగుమతి చేస్తామని చెప్పారు. భవిష్యత్తులో పౌర విమానాలను కూడా భారత్ లోనే తయారుచేస్తామని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. భారత్ లో రక్షణ రంగ తయారీ వ్యవస్థ సరికొత్త శిఖరాలకు చేరుతోందని హర్షం వ్యక్తం చేశారు.

ఈ పరిశ్రమ భారత్-స్పెయిన్ సంబంధాలను బలోపేతం చేస్తుందని, భారత్-స్పెయిన్ భాగస్వామ్యం సరికొత్త దిశగా ముందుకు వెళుతోందని మోదీ అన్నారు. టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ, రెండేళ్లలో తొలి విమానాన్ని సైన్యానికి అందిస్తామని వెల్లడించారు.

# మదర్ థెరిసాతో జరిగిన సంభాషణను తొలిసారి వెల్లడించిన ప్రియాంక గాంధీ

- తన తండ్రి రాజీవ్ గాంధీ హత్య తర్వాత థెరిసా తమ నివాసానికి వచ్చారన్న ప్రియాంక గాంధీ
- బాధలో ఉన్నానని గ్రహించి తనతో కలిసి పనిచేయాలని కోరారని వెల్లడి
- ఢిల్లీలో థెరిసా సిస్టర్స్‌తో కలిసి పనిచేసి పిల్లల బాధలు, ఇబ్బందులు తెలుసుకున్నానని వివరణ



వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆ పార్టీ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ ప్రచారంలో దూసుకెళుతున్నారు. విస్తృత ప్రచారంలో భాగంగా ఇవాళ (సోమవారం) ఆమె ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. 1991లో తన తండ్రి, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య తర్వాత నోబెల్ శాంతి బహుమతి గ్రహీత అయిన మదర్ థెరిసా ఒక రోజు తమ నివాసానికి వచ్చారని ప్రియాంక గాంధీ గుర్తుచేసుకున్నారు. ఆ సందర్భంలో థెరిస్సా చెప్పిన విషయాలను పంచుకున్నారు."నాకు 19 ఏళ్ల వయసు ఉన్నప్పుడు మా నాన్నగారు చనిపోయారు. మదర్ థెరిసా మా అమ్మను (సోనియా గాంధీ) కలవడానికి వచ్చారు. ఆ రోజు నాకు జ్వరం వచ్చి నేను నా గదిలో ఉన్నాను. థెరిసా నన్ను కలవడానికి రూమ్‌లోకి వచ్చారు. నా తలపై చేయి వేసి నా చేతిలో రోజరీ (శిలువ జపమాల) పెట్టారు. మా నాన్న చనిపోయిన నాటి నుంచి నేను బాధలోనే ఉన్న విషయాన్ని ఆమె గ్రహించి ఉండవచ్చు. నువ్వు వచ్చి నాతో కలిసి పని చేయమని ఆమె కోరారు. ఆమె ఆహ్వానం మేరకు నేను ఢిల్లీలోని మదర్ థెరిసా సిస్టర్స్‌తో కలిసి పనిచేశాను" అని ప్రియాంక గాంధీ చెప్పారు.థెరిసాతో సంభాషణ గురించి తాను బహిరంగంగా మాట్లాడటం ఇదే మొదటిసారి అని, ఇలా చెప్పడానికి సందర్భం వచ్చిందని ఆమె అన్నారు. ఢిల్లీలో థెరిసా సిస్టర్స్‌తో కలిసి బాత్‌రూమ్‌లు కడిగానని, పాత్రలు శుభ్రం చేశానని, పిల్లలకు కొంచెం ఇంగ్లీష్ నేర్పించడం లాంటి పనులు చేశానని ప్రస్తావించారు. పిల్లలకు నేర్పించడం, పాత్రలు శుభ్రం చేయడం, పిల్లలను బయటికి తీసుకెళ్లడం వంటి పనులు చేయడంతో పిల్లలు ఎదుర్కొన్న బాధలు, ఇబ్బందులు తెలుసుకున్నానని, సేవ చేయడం అంటే ఏమిటో అర్థం చేసుకున్నానని ప్రియాంక గాంధీ చెప్పారు.

ఒక సంఘం ఎలా సాయం చేస్తుందో కూడా తాను గ్రహించానని అన్నారు. గత వారం ఒక మాజీ సైనికుడి ఇంటిని సందర్శించానని, వృద్ధురాలైన అతడి తల్లి థ్రెసియాతో మాట్లాడిన సమయంలో ఆమె చేతిలో కూడా రోజరీని ఉండడాన్ని

చూశానని ప్రస్తావించారు. ప్రజల అవసరాలు ఏమిటో తాను అర్థం చేసుకోవడం మొదలుపెట్టానని, ఇది ప్రారంభం మాత్రమేనని, తాను వచ్చి అందరి నుంచి సమస్యలు వినాలనుకుంటున్నట్టు ప్రియాంక గాంధీ చెప్పారు. తన బాధ్యతలు ఏమిటో తాను అర్థం చేసుకోవాలనుకుంటున్నట్టు ఆమె చెప్పారు. "నా అన్నపై మీకున్న ప్రేమతో నా మాటలు కూడా వినడానికి మీరు వచ్చారని నాకు తెలుసు. నేను ఆయన చెల్లిని. మిమ్మల్ని విడిచిపెట్టినప్పుడు ఆయన హృదయం ఎంత బరువెక్కిందో నాకు తెలుసు. రాహుల్ గాంధీకి ధైర్యాన్ని ఇచ్చింది మీరే" అని పేర్కొన్నారు. ఈ మేరకు ఎన్నికల ర్యాలీలో ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. కాగా నవంబర్ 13న వయనాడ్ ఓటింగ్ జరగనుంది. నవంబర్ 23న ఫలితం వెలువడుతుంది.

### జగన్ చేయి పట్టుకున్నోళ్లంతా

# పాతాళంలోకే

- మొదటి పేజీ తరువాయి

ఐటీ, ఈడీలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అసలు ఆయనకు ఈ రూ.200 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. ఈ సందర్భంగా జగన్‌పై యనమల కీలక వ్యాఖ్యలు చేశారు. ఒక ఆర్థిక నేరస్థుడు పదకొండేళ్లుగా బెయిల్‌పై ఉండటమేంటని ప్రశ్నించారు. భవిష్యత్తులో జగన్ మళ్లీ అధికారంలోకి రావడం అనేది పగటి కలేనని చురకలంటించారు. పాత కేసులకు తోడు కొత్త కేసులు ఆయనపై సిద్ధంగా ఉన్నాయని, ఇవాళ కాకపోతే రేపైనా జగన్ జైలుకెళ్లడం ఖాయమని అన్నారు.

# పార్టీలకతీతంగా ప్రజా సమస్యల పరిష్కారం

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాల ప్రకారం ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం ఈ సదస్సులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నెల్లూరు జిల్లాలోనే మొట్టమొదటిసారిగా అనంతసాగరం మండలంలో ఈ సదస్సును ఏర్పాటు చేస్తే దాదాపు 1400 మంది అర్జీదారులు తమ సమస్యలను విన్నవించుకున్నారని తెలిపారు. ప్రజల నుంచి అందిన వినతులకు 15 రోజుల్లోగా పరిష్కారం లభిస్తుందని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో ఉన్న ప్రస్తుత ఎంపీటీసీలు, సర్పంచులు కలిసి రావాలని.. వారితో పనిచేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

### జగన్ తన పదవీకాలమంతా

# వసూళ్లతోనే గడిపారు

**పెన్ పవర్ డెస్క్:** మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌పై ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మాణికం ఠాగూర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. జగన్ తన పదవీకాలమంతా వసూళ్లతోనే గడిపారని దుయ్యబట్టారు. ప్రజా సమస్యల పరిష్కారమే వైఎస్ఆర్ మొదటి ప్రాధాన్యత అంటూ వైసీపీ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఒక పోస్ట్ చేసింది. దీనిపై ఆయన ఘాటుగా స్పందించారు. "జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేవలం ధనవంతుల్నే కలిసేవారు. ప్రజా దర్బార్ పేరిట ప్రజల సమస్యలు తెలుసుకునే ఆలోచన చేయలేదు. నిజానికి జగన్ ఎప్పుడూ వైఎస్‌ను అనుసరించలేదు. తన పదవీకాలమంతా జగన్ వసూళ్లతోనే గడిపారు" అని మాణికం ఠాగూర్ పేర్కొన్నారు.

### విద్యుత్ చార్జీల గురించి

# జగన్ మాట్లాడడం విడ్డూరంగా ఉంది

**పెన్ పవర్ డెస్క్:** ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి మాజీ సీఎం జగన్ పై విమర్శనాస్త్రాలు సంధించారు. గత ప్రభుత్వ హయాంలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని, ఇప్పుడు జగన్ విద్యుత్ చార్జీల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. ట్రూప్ అప్ చార్జీలపై ఈఆర్సీ ప్రతిపాదన జగన్ ప్రభుత్వం చేసిన పాపమేనని వ్యాఖ్యానించారు. నాడు జగన్ తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల రూ.6,072 కోట్ల మేర ట్రూప్ అప్ చార్జీల భారం పడిందని మంత్రి పార్థసారథి ఆరోపించారు.

# విజయమ్మ ఎటూ...

**విజయవాడ, అక్టోబరు 28, పెన్ పవర్:** వైఎస్ జగన్, వైఎస్ షర్మిల ఆస్తుల వివాదం రచ్చ రచ్చగా మారింది. రోడ్డు మీదకు ఎక్కింది. రాజకీయంగా చర్చకు దారి తీసింది. కుటుంబాల గొడవ ఎందుకని జగన్ ప్రశ్నిస్తున్నారు. అదే సమయంలో కుటుంబం గొడవ కాదని, ఒక తల్లి, చెల్లికి జరిగిన అన్యాయం అంటూ అధికార పక్షం వాదిస్తుంది. ఇటు వైఎస్ షర్మిల రోజుకో లేఖలను విడుదల చేస్తున్నారు. జగన్ తరుపున మీడియా సమావేశాలు పెట్టి వైఎస్ షర్మిల పైన, చంద్రబాబుపైన వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారు. జగన్ ఓటమి పాలయి రాజకీయంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఈ ఆస్తుల వివాదం నిజంగానే జగన్ కు తలనొప్పిగా మారింది. అన్నా చెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు లేవని స్పష్టంగా అర్థమయింది. ఈ విషయాన్ని జగన్ స్వయంగా కూడా చెప్పారు. రాజకీయంగా తనను వ్యతిరేకించడమే కాకుండా, వ్యక్తిగతంగా తనను, తన కుటుంబంపై విమర్శలు చేయడంతో ఆమెతో తెగదెంపులు చేసుకోవడానికే సిద్ధపడినట్లు కనిపిస్తుంది. పేగు బంధం, రక్త సంబంధం అంటూ ఇక సెంటిమెంట్ తో వేలాడే సూచనలు మాత్రం ఇద్దరి వద్ద కనిపించడం లేదు. వైఎస్ షర్మిల కూడా జగన్ కు దీటుగానే స్పందిస్తున్నారు. తాను ఏ విషయంలో తగ్గనని, తన వాటా తనకు కావాల్సిందేనంటూ.. ఒక ఆడపడుచుకు అన్యాయం చేస్తావా? అంటూ నిలదీయడానికి సిద్ధమయ్యారు. ఈ పరిస్థితుల్లో తల్లి విజయమ్మ మౌనం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. తల్లి విజయమ్మ ఎటు వైపు మొగ్గు చూపుతుందని రాజకీయ పార్టీలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. వైఎస్ కుటుంబ సభ్యులు కూడా విస్తుబోయి చూడటం మినహా ఈ వివాదంలో తలదూర్చే ప్రయత్నం చేయడం లేదు. వైఎస్ కు సోదరులు, చెల్లెళ్లు ఉన్నప్పటికీ వారంతా ఈ కాంట్రవర్సీలో కాలుమోపడం లేదు. మనకెందుకు వచ్చిన తంటా అని గమ్మున ఉన్నారు. ఇక తల్లి విజయమ్మ పరిస్థితి కూడా అగమ్య గోచరంగా ఉంది. ఒకవైపు కన్న కొడుకు, మరొక వైపు గారాల కూతురు. ఇద్దరినీ వదులుకోలేరు. ఇద్దరితో బంధాన్ని తెంచుకోలేరు. తనకు సాయం చేసేవారు కూడా లేరు. అసహాయ స్థితిలో విజయమ్మ ఉన్నట్లే కనపడుతుంది.

01 నేడు బాలినేని పిటీషన్ పై తుది తీర్పు మానసిక వేదన... విజయమ్మ ఎటువైపు మొగ్గు చూపినా మరొకరు హర్ట్ అవుతారు.



హర్ట్ అవ్వడమే కాదు దూరమవుతారన్న భయం ఆమెను వెంటాడుతుంది. కానీ ఇద్దరు మొండోళ్లు అని తెలుసు. తాను చెప్పినా వినరని ఆమెకు తెలియంది కాదు. అలాగని మౌనంగా ఉంటే ఈ రచ్చ ఎన్నాళ్లు కొనసాగుతుందో తెలియదు. దీంతో ఆమె లోటస్ పాండ్ లో ఉండి తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని తెలిసింది. ఎవరూ ఈ వివాదాన్ని పరిష్కరించలేని పరిస్థితుల్లో, తాను పెదవి విప్పలేని విషయం కావడంతో ఆమె బాధ వర్ణనాతీతం. ఏ కన్నతల్లికీ ఇలాంటి బాధ రాకూడదు. ఆమె బతికుండగానే రెండు గోడలు వెలిశాయి. అడ్డుగోడలు తొలిగిపోయేలా లేవు. కుమిలిపోతున్నారు. కుంగిపోతున్నారు. విజయమ్మను మాత్రం వైఎస్ జగన్ కానీ, షర్మిల కానీ దృష్టిలో ఉంచుకోకుండా తమ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నారు. మధ్యలో నలిగిపోయేది తల్లి విజయమ్మ మాత్రమే. వైఎస్ అభిమానులు కూడా విజయమ్మ ఏదో ఒకటి చేసి ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టాలని కోరుకుంటున్నారు.

# ఇంకా ఆగని ఆస్తి చిచ్చు

**విజయవాడ, అక్టోబరు 28, పెన్ పవర్:** జగన్‌తో ఉన్న ఆస్తుల వివాదంలో అసలేం జరిగిందో వైఎస్ షర్మిల ఓ లేఖ ద్వారా వైఎస్ అభిమానులుకు తెలిపారు. అందులో అత్యంత కీలకమైన విషయాలు ఉన్నాయి. కుటుంబ వ్యాపారాలకు జగన్ "గార్డియన్ " మాత్రమేనని .. అన్నీ వ్యాపారాలు నలుగురు మనవళ్లు, మనవరాళ్లకు సమానంగా పంచి పెట్టలనేది జగన్ మోహన్ రెడ్డి భాధ్యత అని వైఎస్ రాజశేఖర్ రెడ్డి నిర్ణయం అన్నరు. వైఎస్ఆర్ ఉద్దేశ్యాన్ని ఆయన బిడ్డలమైన మాకు, ఆయన భార్యకు, సన్నిహితులందరికి,స్పష్టంగా తెలియచేశారని.. కేవీపీ రామచందరరావు , వైవి సుబ్బారెడ్డి , విజయసాయి రెడ్డి కి కూడా తెలుసని షర్మిల స్పష్టం చేశారు. నాన్న బ్రతికి ఉండగా స్థాపించిన అన్ని వ్యాపారాల్లో, సరస్వతి అయినా...భారతి సిమెంట్స్ అయినా... సాక్షి మీడియా, క్లాసిక్ రియాలిటీ, యలహంక ప్రాపర్టీ, ఇలాంటివి ఏమైనా... నలుగురి బిడ్డలకు సమాన వాటా ఉండాలి అన్నది వైఎస్ఆర్ మాండేట్. ( ఒక్క సండూరు మినహాయించి ). రాజశేఖర్ రెడ్డి బ్రతికి ఉన్నంత వరకు ఏ ఒక్క ఆస్తి పంపకం కూడా జరగలేదు. వైఎస్ఆర్ హఠాత్తుగా మరణించారు. ఆ తర్వాత కూడా ఏ ఆస్తి పంపకాలు జరగలేదు. ఈ రోజు వరకు నాకు న్యాయంగా రావాల్సిన ఒక్క ఆస్తి కూడా నా చేతుల్లో లేదని షర్మిల లేఖలో తెలిపారు. వైఎస్ జగన్ గురించి ఆయన సోదరి షర్మిల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు జగన్ అంటే ప్రాణం అని స్పష్టం చేశారు. సుబ్బారెడ్డి తన గురించి ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఆస్తి పంపకాల ఇష్యూపై వైఎస్ షర్మిల స్పందించారు. ఈ సమస్యపై సుబ్బారెడ్డి తన గురించి ఎందుకు మాట్లాడుతున్నారు? అని ప్రశ్నించారు. ఆయన ఎవరు? అని నిలదీశారు. సుబ్బారెడ్డి జగన్ మోచేతి నీళ్లు తాగేవాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్ పదవులు ఇస్తే అనుభవిస్తున్నారన్న షర్మిల.. ఇలా కాకపోతే ఎలా మాట్లాడుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేపు సాయి రెడ్డి కూడా మాట్లాడుతారు.. సాయి రెడ్డి కూడా ఆయన చేతిలోనే ఉన్నాడు కదా వ్యాఖ్యానించారు.వాళ్ల దగ్గర ఇంకా నిజాయితీ ఏమైనా ఉందా చూద్దాం అనుకున్నాను. వీళ్లందరికీ వైఎస్ఆర్ తెలుసు. ఆయన మనోభావాలు కూడా తెలుసు. అమ్మకు అర్థం కావాలి. నా వరకు నేను చెప్తున్నది నిజమని నేను ప్రమాణం చేయగలను. సుబ్బారెడ్డి కూడా ప్రమాణం చేయాలి. వైఎస్ఆర్ బిడ్డ తన బిడ్డల మీద ప్రమాణం చేసి చెప్తుంది. వైఎస్ఆర్ ఉన్నప్పుడు భారతి సిమెంట్స్‌లో నలుగురు చిన్న బిడ్డలకు సమాన వాట ఉండాలన్నారు. ఇది ప్రమాణంగా చెప్తున్న' అని షర్మిల స్పష్టం చేశారు.ఇచ్చిన మాట ఏమయ్యింది అని జగన్ అన్నను అడిగా. జగన్ నాన్నకు మాట ఇచ్చారు. ఈ లోకంలో నీ తరువాత పాప మేలుకోరేది నేనే అని జగన్ చెప్పాడు. డోంట్ వర్రీ డాడ్ అన్నాడు. ఇది నిజం అని నా బిడ్డల



మీద ప్రమాణం చేసి చెప్తా. వైవీ సుబ్బారెడ్డి తన బిడ్డల మీద ప్రమాణం చేసి చెప్పాలి. లేదా జగన్ మోహన్ రెడ్డి ప్రమాణం చేసి చెప్పాలి. సుబ్బారెడ్డి అంటున్నాడు.. సాక్షికి, భారతి సిమెంట్స్‌కి వాళ్ల పేర్లు పెట్టుకున్నారట. అందుకే ఆ ఆస్తులు వాళ్లవే నట. అందులో నాకు హక్కు లేదట. జగన్ సొంతగా సంపాదించాడట' అని షర్మిల వ్యాఖ్యానించారు.'ఆరోజు వాళ్ల పేర్లు పెట్టుకుంటే నేను అభ్యంతరం చెప్పలేదు. పేర్లతో ఏముంది అనుకున్నాను. అన్న ముచ్చట పడ్డాడు అనుకున్నాను. వాళ్ల పేర్లతో ఆస్తులు ఉంటే.. నిజంగా వాళ్లవి అవుతాయా? నా పేరు మీద ఆస్తులు రాసి ఉంటే నేను ఎందుకు జైలుకి వెళ్లలేదు అంటున్నారు. ఏ అన్న అయినా.. చెల్లెలు గిఫ్ట్ అంటే.. ఏ బంగారమో... చీరనో... గిఫ్ట్ ఇస్తారు. అంతేకాని ఆస్తుల్లో 40 శాతం వాట ఇస్తారా? ఇవ్వాలని అనుకున్నది గిఫ్ట్ కాదు.. నా హక్కు. నా హక్కు కాబట్టే నాకు ఇస్తామని అన్నారు' అని షర్మిల వివరించారు'ఇవ్వాల్సిన భాధ్యత వాళ్లకు ఉంది కాబట్టి ఎంవోయూ రాశారు. ఎంవోయూ రాయమని నేను అడగలేదు. సరస్వతి సిమెంట్స్ ఈడీ అటాచ్‌లో లేదు. అందుకే సరస్వతి సిమెంట్స్ వెంటనే ట్రాన్స్ ఫర్ చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ఎందుకు నిలబెట్టుకోలేదు. జగన్ మోహన్ రెడ్డి అంటున్నాడు.. ప్రతి ఇంట్లో ఉండే కహాని అంట. ఇంత సునాయాసంగా ఎలా మాట్లాడుతున్నారు. మీకు సెంటిమెంట్ లేదా? ఎమోషన్ లేదా? ఈ మాటలు ఎవరో అంటే పట్టించుకొనే దాన్ని కాదు. నా సొంత చిన్నాన్నా అంటే నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. చిన్నాన్న.. నా బిడ్డలు నీ ముందు పెరగలేదా? నా బిడ్డలను మీరు తాకలేదా?' అని షర్మిల ప్రశ్నించారు.'దేవుడు అంతా చూస్తున్నాడు. అంతా గమనిస్తున్నాడు. వైసీపీ క్యాడర్‌కి నేను ఒక మాట చెప్పాలని అనుకుంటున్న.. 2019లో వైసీపీ ప్రభుత్వం 151 స్థానాలు గెలిచి ఏర్పడింది. ఇది అప్పుడు అఖండ విజయం. ఎలా సాధ్యం అయింది. ఎంతో మంది వైఎస్ఆర్ అభిమానులు అనుకుంటే వచ్చింది. ఎంతో కష్టపడితే... త్యాగాలు చేస్తే ఆ విజయం సాధ్యం అయింది. నేనే కాదు...అమ్మే కాదు..ఎంతో మంది త్యాగాలు చేశారు. నేను అమ్మ ఇద్దరం మా శక్తి కి మించి పని చేశాం' అని షర్మిల భావోద్వేగానికి గురయ్యారు.'అమ్మకు మోకాళ్ల నొప్పులు ఉండేవి. బాధలు భరించి ఏడ్చుకుంటూ పార్టీ కోసం కష్టం చేసింది. నేను కూడా 3200 కిలోమీటర్లు పాదయాత్ర చేశా. నన్ను పాదయాత్ర చేయమని అడిగితే చేశా. నన్ను ఆరోజుల్లో సూర్యుడు వరకు వెళ్లమని అన్నా కూడా వెళ్లే దాన్ని. ప్రాణాలను సైతం నేను లెక్క చేయలేదు. నాకు జగన్ అన్న అంటే ప్రాణం. వైసీపీనీ అడుగుతున్న.. నేను మీకు ఏం అన్యాయం చేశా.. ఒక్క కారణం చెప్పండి. మీకు ఏం అవసరం వస్తే అవసరానికి మించి తిరిగా' అని షర్మిల వ్యాఖ్యానించారు.'సమైక్యాంధ్ర ఉద్యమం చేయమని అడిగితే చేశా. ఓదార్పు యాత్ర చేశా. బై బై బాబు అంటూ చేసిన క్యాంపెయిన్ దేశంలో పెద్దది. మీకు ఇన్ని చేస్తే... మీరు నాకు ఏం చేశారు? మీరు నాకు, నా బిడ్డలకు అన్యాయం చేస్తున్నారు. ఇది అమ్మకు తెలుసు..అందరికీ తెలుసు. 5 ఏళ్లు మీరు రాసి ఇచ్చిన ఎంవోయూ నా చేతుల్లో ఉంది. నాకు ఎన్ని ఇబ్బందులు ఉన్నా.. నాకు అవసరం వచ్చినా... నేను బయట పెట్టలేదు. ఎంవోయూ బయటకు పోతే వైఎస్ఆర్ గురించి నలుగురు నాలుగు రకాలుగా మాట్లాడుతారు. నాన్న పేరు చెడగొట్టడం నాకు ఇష్టం లేదు' అని షర్మిల వివరించారు.'నాకు వేరే స్వార్థం ఉంటే నేను ఏదో ఒక మీడియా హౌజ్‌కి ఇచ్చేదాన్ని కదా. ఇవ్వాళ అందరి చేతుల్లో ఎంవోయూ ఉంది. దీనికి కారణం నువ్వు కాదా? సొంత కొడుకు తల్లిని కోర్టుకి ఈడ్చాడు. ఇది చూడటానికి నేను ఇంకా బ్రతికి ఉన్నానా అని విజయమ్మ ఏడుస్తుంది. బెయిల్ రద్దు చేసేందుకు.. నేను ఈ కుట్ర పన్నాను అంటున్నాడు. అందుకే కోర్టుకి తల్లిని ఈడ్చాడట. నీ లబ్ధి కోసం తల్లిని వాడుకుంటవా. వైఎస్ఆర్ చనిపోయాక... సీబీఐ ఛార్జ్ షీట్‌లో పేరు పెట్టించింది ఈ జగన్ కాదా? ఛార్జ్ షీట్‌లో పెట్టక పోతే.. బెయిల్ రాదని చేర్చిన మాట నిజం కాదా? నీ లబ్ధికి అమ్మా నాన్నలను వాడుకుంటారా?' అని షర్మిల నిలదీశారు.

# సరస్వతి భూముల్లో సర్వే

**గుంటూరు, అక్టోబరు 28, పెన్ పవర్:** డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో అధికారులు కదిలారు. జగన్ కంపెనీ సరస్వతి పవర్ భూముల్లో సర్వే నిర్వహించారు. పవన్ కళ్యాణ్ ఆదేశించడంతో.. అధికారులు శనివారం సర్వే చేపట్టారు. సరస్వతి భూములపై పవన్ కళ్యాణ్ అధికారులను సమగ్ర నివేదిక కోరారు.పల్నాడు జిల్లాలోని సరస్వతి భూముల్లో అధికారులు సర్వే నిర్వహించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో యంత్రాంగం కదిలింది. దాచేపల్లి డీఆర్వో ఆధ్వర్యంలో ఫారెస్ట్ సిబ్బంది సర్వే చేపట్టారు. సరస్వతి సిమెంట్ భూముల్లో.. అటవీ భూముల వివరాలను పవన్ కళ్యాణ్ అడిగారు. సమగ్ర నివేదిక కోరారు. దీంతో వెంటనే అధికారులు రంగంలోకి దిగి సర్వే చేశారు. ఈ ఇష్యూ ఇప్పుడు ఏపీలో హాట్ టాపిక్‌గా మారింది.పల్నాడు జిల్లా దాచేపల్లి, మాచవరం మండలాల్లో సరస్వతి పవర్ సంస్థకు చెందిన భూముల్లో అటవీ భూములు ఏవైనా ఉన్నాయా?.. ఉంటే వాటి విస్తీర్ణం ఎంత ఉందో నివేదిక ఇవ్వాలని.. అటవీ శాఖ అధికారులను, పల్నాడు జిల్లా యంత్రాంగాన్నీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఈ సంస్థకు చెందిన 1515.93 ఎకరాల్లో ప్రకృతి సంపద, వాగులు, వంకలు, కొండ భూములు ఉన్నాయనే వార్తలు వెలుగులోని వచ్చిన క్రమంలో పవన్ కళ్యాణ్ అధికారులతో చర్చించారు.సరస్వతి పవర్ సంస్థకు చెందిన భూముల్లో ప్రభుత్వ భూములు, జల వనరులు ఏ మేరకు ఉన్నాయో తెలియజేయాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అటవీ భూములు ఏ మేరకు ఉన్నాయో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. వాగులు, వంకలు, కొండలు ఉన్నందున ఆ సంస్థకు పర్యావరణ అనుమతులు ఏ విధంగా పొందారో చెప్పాలని.. పీ.సీ.బీ.కీ ఆదేశాలు ఇచ్చారు. ఈ అంశంపై అటవీ, రెవెన్యూ, పీసీబీ ఉన్నతాధికారులతో త్వరలో సమీక్షించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్ణయించారు.ఓవైపు ఆస్తి పంపకాల విషయంలో జగన్ వర్సెస్ షర్మిల ఫైట్ నడుస్తోంది. దీనిపై పొలిటికల్ కామెంట్స్ హాట్ టాపిక్‌గా మారాయి. ఈ సమయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ నిర్ణయం తీసుకోవడం సంచలనంగా మారింది. అటు ఆస్తి వివాదంపై పొలిటికల్ కామెంట్స్ పెరిగాయి. వైసీపీ కీలక నేతలు వైవీ సుబ్బారెడ్డి, మాజీమంత్రి పేర్ని నాని ఆస్తి పంపకాలపై సంచలన కామెంట్స్ చేశారు.'అవి జగన్ సొంత సంస్థలు. వాటిలో షర్మిల వాటాదారు కాదు. దాన్ని ఆనాడు వైఎస్సార్ కూడా కోరుకోలేదు. ఆయన ఉన్నప్పుడే జగన్ ఆ కంపెనీలు ప్రారంభించారు. అవి జగన్ స్వార్జితం. అయినా చెల్లికి వాటా ఇస్తానన్నారు. హైకోర్టు స్టేటస్‌కో ఉన్నా షర్మిల షేర్లు మార్చుకున్నారు. అందుకే జగన్ ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించారు. అంతే తప్ప.. ఆస్తుల కోసం కోర్టు మెట్లు ఎక్కలేదు' అని వైవీ సుబ్బారెడ్డి వివరించారు.'జగన్ కంపెనీల్లో షర్మిల వాటాదారనుకుంటే ఆమె పేరెందుకు లేదు? భారతి సిమెంట్స్, జగతి పబ్లికేషన్స్ అనే ఎందుకు పెట్టారు? అదంతా వైఎస్సార్ హయాంలోనే జరిగింది కదా? ఆయన కూడా షర్మిలను షేర్‌హోల్డర్‌గా కోరుకోలేదు. తాను చెల్లికి ఇస్తోంది స్వార్జిత ఆస్తులని ఎంఓయూలో ఉంది. అదే విషయాన్ని ఎంఓయూలో జగన్ స్పష్టంగా రాశారు. అది చదివాకే షర్మిల, విజయమ్మ ఇద్దరూ సంతకాలు చేశారు. అలాంటప్పుడు కంపెనీల్లో షర్మిల ఎలా వాటాదారవుతారు? జగన్ స్వార్జిత ఆస్తిలో ఎక్కడా షర్మిల ప్రమేయం లేదు' అని వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు.'ఇచ్చిన మాట కోసం జగన్ కాంగ్రెస్‌ను వీడారు. అన్యాయంగా కేసులు పెడితే 16 నెలలు జైల్లో ఉన్నారు. ఎన్నో బాధలు పడ్డారు. అవమానాలూ ఎదుర్కొన్నారు. అయినా ఏనాడూ మాట తప్పలేదు. అబద్ధాలు చెప్పలేదు. రాజకీయాల్లో ఎక్కడా అనైతికంగా వ్యవహరించలేదు. అలాంటి వ్యక్తి, మీకు ఇచ్చిన మాట తప్పుతారా?. అలా అయితే అసలు ఎంఓయూ రాసి ఇస్తారా? మీకు ప్రేమ, అభిమానంతోనే కదా ఆస్తులు ఇస్తానంది. ఇవన్నీ ప్రజలు నమ్ముతారని అనుకుంటున్నారా? వీటన్నింటినీ మీ విచక్షణ, వివేకానికే వదిలేస్తున్నాం' అని పేర్ని నాని వ్యాఖ్యానించారు.

## ఇక అమరావతి మామూలుగా లేదుగా

**విజయవాడ, అక్టోబరు 28, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అమరావతికి మించి మరే ప్రయారిటీ లేదు. దానిని పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఈ ఐదేళ్లలో అమరావతిని ఒక దశకు తేవాలన్నది ఆయన



ప్రయత్నంగా కనిపిస్తుంది. అమరావతి తర్వాతే ఆయనకు ఏదైనా.. అలా ముందుకు సాగుతున్నారు. అమరావతిలో పనులు పరుగులు పెట్టించాలన్న భావనతో ఉన్న చంద్రబాబు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటు ప్రపంచ బ్యాంకు నిధులు పదిహేను వేల కోట్ల రూపాయలు మంజూరు అవుతాయని చెప్పడంతో ఇక టెండర్లను పిలిచేందుకు చంద్రబాబు సర్కార్ సిద్ధమయింది. అందుకు సీఆర్డీఏ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే 36 కోట్ల రూపాయలు వెచ్చించి అమరావతిలో చెట్లను తొలగించారు. ముళ్లపొదలన్నింటినీ క్లియర్ చేసేసి క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంచారు. అయితే ఇప్పుడు భవనాల నిర్మాణాలను అత్యవసరంగా ప్రారంభించాలని చంద్రబాబు భావిస్తున్నారు. ప్రతి రోజూ మున్సిపల్ శాఖ, సీఆర్డీఏ అధికారులు వెంట పడుతూ అమరావతి పనులను సమీక్షిస్తున్నారంటే ఎంత ప్రిస్టేజ్ గా తీసుకున్నారో అర్థమవుతుంది. ప్రపంచబ్యాంకు నిధులతో అమరావతిలో కొత్త అసెంబ్లీ, కొత్త సెక్రటేరియట్ తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేల క్వార్టర్ల నిర్మాణంతో పాటు ఉన్నతాధికారుల క్వార్టర్ల ఆధునికీకరణ పనులను వేగంగా పూర్తి చేసి తొలి దశ పనులను పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఇందుకోసం ప్రపంచ బ్యాంకు నిధుల కోసం వెయిట్ చేయకుండా ముందుగా హడ్కో నుంచి పదకొండు వేల రూపాయలు రుణం తీసుకునేందుకు సిద్ధమయ్యారు. ఈరోజు సాయంత్రం హడ్కో ఛైర్మన్ తో ఆయన సచివాలయంలో సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో అమరావతి నిర్మాణం కోసం పదకొండు వేల రూపాయలు రుణాన్ని చంద్రబాబు అడగనున్నారు. దీంతో చంద్రబాబు నాయుడు అటు ప్రపంచ బ్యాంకు నిధులు పదిహేను వేల కోట్లు, ఇటు హడ్కో నిధులు పదకొండు వేల కోట్ల రూపాయలతో కలసి మొత్తం 26 వేల కోట్ల రూపాయల నిధులతో అమరావతిలో నిర్మాణాల వేగం పెంచాలని నిర్ణయంలో ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యేకంగా రైల్వే లైన్ ను కేటాయించడం తమకు మరింత అనుకూలంగా మారుతుందని భావిస్తున్నారు. దేశంలోనే అతి పెద్ద నగరంగా, అత్యాధునిక వసతులతో కూడిన రాజధానిగా నిర్మాణం చేయాలన్న తపన చంద్రబాబులో కనిపిస్తుంది. చంద్రబాబు ప్రస్తుతం కసిమీద ఉన్నట్లే అనిపిస్తుంది. అందుకే అమరావతి కోసం ఆయన ఎన్ని వేల కోట్ల రూపాయలు అప్పులు చేయడానికి కూడా వెనకాడటం లేదు. అదే రాష్ట్రానికి సంపదను తెచ్చిపెడుతుందని ఆయన విశ్వసిస్తున్నారు. తన హయాంలోనే అమరావతి నిర్మాణం పూర్తయి చరిత్రలో తన పేరు చిరస్థాయిగా నిలిచిపోవాలని చంద్రబాబు కోరుకుంటున్నారు. ఇందులో తప్పేమీ లేదు కానీ.. నిధులన్నీ అమరావతికే వెచ్చిస్తే అప్పులు తెచ్చి అమరావతిని అందంగా తీర్చి దిద్దితే.. సంక్షేమ పథకాల సంగతి ఏంటన్న ప్రశ్న కూడా ప్రశ్న గానే మిగులుతుంది.

## డిసెంబర్ 1 నుంచి పెరగనున్న రిజిస్ట్రేషన్ చార్జీలు

**కాకినాడ, అక్టోబరు 28, పెన్ పవర్:** ఏపీలో భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. డిసెంబర్ 1 నుంచి రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయి. కొత్త రిజిస్ట్రేషన్ ఛార్జీలు 10 నుచి 20 శాతం పెరిగే అవకాశం ఉంది. స్టాంపు పేపర్లు అందుబాటులో ఉంచుతామని అధికారులు తెలిపారు.ఏపీలో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. డిసెంబర్ 1 నుంచి రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయి. సాధారణంగా పట్టణాల్లో ప్రతి ఏడాది ఆగస్టు 1, గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లకొకసారి రిజిస్ట్రేషన్ విలువలు సవరిస్తుంటారు. తాజాగా కూటమి ప్రభుత్వం డిసెంబర్ 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమలు చేయాలని నిర్ణయించింది.భూముల బహిరంగ మార్కెట్ విలువ, స్థానిక అభివృద్ధి అంశాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువలను పెంచుతూ ఉంటుంది. వైసీపీ హయాంలో కొన్నిచోట్ల రిజిస్ట్రేషన్ విలువలు పెంచారు. కూటమి సర్కార్... జాయింట్ కలెక్టర్ స్థాయిలో కమిటీలు ఏర్పాటుచేసి రిజిస్ట్రేషన్ విలువలపై గత రెండున్నర నెలల నుంచి వివరాలు సేకరిస్తోంది. మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్ ఈ కమిటీ పరిశీలనలు, రిజిస్ట్రేషన్ విలువల పెంపుపై కసరత్తు చేస్తున్నారు. విలువల పెంపు, తగ్గింపుపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. కొత్త రిజిస్ట్రేషన్ ఛార్జీలు 10 నుచి 20 శాతం పెరిగే అవకాశం ఉంది. స్థానిక అంశాలు ఆధారంగా ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువలు ఎక్కువగా ఉంటే తగ్గించే ఛాన్స్ ఉంది. నేషనల్ హైవేలు, గ్రోత్ కారిడార్‌లు, ఇతర అంశాల ప్రతిపాదికన భూముల రిజిస్ట్రేషన్ విలువలు ఖరారు చేయనున్నారు. 2023-24లో దస్తావేజుల రిజిస్ట్రేషన్ తో రూ.10 వేల కోట్ల ఆదాయం రాగా... ఈ ఆర్థిక సంవత్సరంలో అక్టోబరు వరకు రూ.5 వేల కోట్ల ఆదాయం వచ్చిందని రెవెన్యూ అధికారులు తెలిపారు. రెండువారాల్లో అధికారిక సమావేశం జరగబోతుందని, ఆ సమావేశంలో రిజిస్ట్రేషన్ విలువల పెంపుపై స్పష్టత వస్తుందని అధికారులు అంటున్నారు.సబ్ రిజిస్ట్రాన్ ఆఫీసుల్లో స్టాంపు పేపర్లను అందుబాటులోకి తీసుకోస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఈ-స్టాంప్ పేపర్ తో పాటు ఫిజికల్ స్టాంపుపేపర్ల ద్వారా రిజిస్ట్రేషన్లను కొనసాగిస్తామన్నారు. రూ.50, రూ.100 స్టాంపు పేపర్లు 10 లక్షలు చొప్పున ప్రతి సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులకు పంపుతున్నామన్నారు.

## టీచర్ల ప్రమోషన్ కు గ్రీన్ సిగ్నల్

**ఒంగోలు, అక్టోబరు 28, పెన్ పవర్: :** ఆంధ్రప్రదేశ్‌లోని పురపాలక ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించేందుకు పాఠశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. పురపాలక స్కూళ్ల నిర్వహణ బాధ్యతను 2022 జూన్‌లో ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖకు అప్పగించింది. ఈ విభాగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 2017 నుంచి ప్రమోషన్లు కల్పించలేదు. పంచాయతీ రాజ్, ప్రభుత్వ విభాగంలోని ఉపాధ్యాయులకు సర్దుబాటు పేరుతో ప్రమోషన్లు ఇచ్చారు. కానీ.. పురపాలక టీచర్లకు మాత్రం కల్పించలేదు. వీరి సర్వీసు నిబంధన వేరుగా ఉండటంతో సాధ్యం కాలేదని అధికారులు చెబుతున్నారు.అటు ఒక శాఖ నుంచి మరో శాఖకు రావడంతో తమను పట్టించుకోవడం లేదని పురపాలక ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటుకు పంచాయతీ రాజ్, ప్రభుత్వ పాఠశాలల్లో జీవో నంబర్ 117ను అమలు చేశారు. పురపాలక స్కూళ్లలో మాత్రం అనధికారికంగా అమలు చేశారు. దీంతో ప్రమోషన్లు లేక పురపాలక ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారు. వీరికి ప్రత్యేకంగా ఎంఈవో, డీఈవో, డైరెక్టర్ వంటి వ్యవస్థ లేదు. పంచాయతీ రాజ్, ప్రభుత్వ విభాగంలోని అధికారులే వీరిని పర్యవేక్షిస్తున్నారు.పదోన్నతుల్లో మెరిట్, రిజర్వేషన్లు పాటించాలని పురపాలక ఉపాధ్యాయులు కోరుతున్నారు. పురపాలక స్కూళ్లలో ప్రవేశాలు ఎక్కువగా ఉన్నాయి. అదే సమయంలో టీచర్ల కొరత కూడా ఉంది. ఇటీవల సర్దుబాటు చేసినప్పుడు ఇతర స్కూళ్ల టీచర్లను ఈ పాఠశాలలకు పంపించారు. ఈ నేపథ్యంలో.. తమకు ప్రమోషన్లు కల్పించాలని పురపాలక ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో పాఠశాల విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. ప్రభుత్వంతో మాట్లాడి.. పదోన్నతులు కల్పిస్తామని ఉపాధ్యాయ సంఘాలకు అధికారులు హామీ ఇచ్చారు.ఆంధ్రప్రదేశ్‌లో భారీగా విద్యా శాఖ అధికారులు బదిలీ అయ్యారు. 21 జిల్లాలకు సంబంధించి విద్యా శాఖ అధికారులను బదిలీ చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. మరోవైపు ఉపాధ్యాయ బదిలీలు ప్రక్రియ నిలిచిపోయింది. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ బదిలీలను నిలిపివేసిన కూటమి ప్రభుత్వం.. ఇంకా ఆ ప్రక్రియను చేపట్టలేదు. ఉపాధ్యాయ బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వం అడుగు కూడా ముందుకు వేయలేదు. దీంతో ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉపాధ్యాయ బదిలీలను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి.

# టీమిండియాకు పొంచివున్న చెత్త రికార్డు... నాడు సచిన్ కెప్టెన్‌గా ఉన్నప్పుడూ ఇలాగే..!

**ముంబై టెస్టులోనూ న్యూజిలాండ్ గెలిస్తే భారత్ ఖాతాలో అవాంఛిత రికార్డు**

**స్వదేశంలో 0-3 తేడాతో వైట్‌వాష్‌కు గురయ్యే అవకాశం**

**చివరిసారిగా 1997లో శ్రీలంక చేతిలో 0-3 తేడాతో ఓడిన భారత్**





**హైదరాబాద్ పెన్ పవర్:** స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 0-2 తేడాతో భారత్ కోల్పోయింది. ఫలితంగా దాదాపు 12 ఏళ్ల తర్వాత సొంత గడ్డపై టీమిండియా టెస్ట్ సిరీస్‌ను చేజార్చుకుంది. 2012 నుంచి స్వదేశంలో వరుసగా 18 టెస్ట్ సిరీస్‌లు సాధించిన టీమిండియా విజయాల పరంపరకు న్యూజిలాండ్ ఆటగాళ్లు బ్రేక్ వేశారు. ఇక ముంబై వేదికగా జరగనున్న మూడవ టెస్ట్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఆటగాళ్లు గెలిస్తే భారత్ ఖాతాలో ఒక అవాంఛిత రికార్డు చేరే అవకాశం ఉంది. దాదాపు 27 ఏళ్ల తర్వాత మూడు లేదా అంతకంటే ఎక్కువ టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్‌ను వైట్‌వాష్ చేసిన తొలి జట్టుగా అవతరించేందుకు న్యూజిలాండ్‌కు అవకాశం ఉంది. 2000 సంవత్సరంలో స్వదేశంలో జరిగిన ఒక టెస్ట్ సిరీస్‌లో భారత్ ఒక్క మ్యాచ్‌ను కూడా గెలవలేకపోయింది. ఈ సిరీస్‌లో దక్షిణాఫ్రికా 2-0 సిరీస్‌ను కైవసం చేసుకుంది. ముంబై వేదికగా జరిగిన మ్యాచ్‌ను 4 వికెట్ల తేడాతో, బెంగళూరులో రెండవ టెస్టును ఇన్నింగ్స్, 71 పరుగుల తేడాతో పర్యాటక జట్టు గెలుచుకుంది. ఆ సమయంలో భారత జట్టు కెప్టెన్‌గా సచిన్ టెండూల్కర్ ఉన్నాడు. ఈ సిరీస్‌లో భారత్ బ్యాటింగ్ చేసిన నాలుగు ఇన్నింగ్స్‌లలో ఒక్కసారి కూడా 250కిపైగా స్కోర్ చేయలేకపోయింది. భారత్‌పై అన్ని విధాలా ఆధిపత్యం చెలాయించిన దక్షిణాఫ్రికా జట్టు ఒక ఇన్నింగ్స్‌లో ఏకంగా 479 పరుగుల భారీ స్కోరు సాధించింది.

**0-3 తేడాతో వైట్‌వాష్ చేసిన శ్రీలంక**

ఇక 1997లో టీమిండియాను శ్రీలంక 3-0 తేడాతో వైట్‌వాష్ చేసింది. మూడు మ్యాచ్‌లో సిరీస్‌లో భారత్ ఒక్క మ్యాచ్ కూడా గెలవలేకపోయింది. అప్పుడు కూడా సచిన్ టెండూల్కర్ కెప్టెన్‌గా ఉన్నాడు. శ్రీలంక కెప్టెన్‌గా అర్జున్ రణతుంగ ఉన్నాడు. ప్రస్తుతం కెప్టెన్ రోహిత్ శర్మ నేతృత్వంలోని టీమిండియా ముంబై వేదికగా జరగనున్న టెస్ట్ మ్యాచ్‌లో ఓడిపోతే అవాంఛిత రికార్డు ఖాతాలో పడుతుంది.

కాగా మూడవ టెస్టులో గెలుపు టీమిండియాకు చాలా కీలకమైనది. ఎందుకంటే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించాలంటే ఇకపై ప్రతి మ్యాచ్‌ను గెలవాల్సిన పరిస్థితి ఏర్పడిన విషయం తెలిసిందే.

# ఆసియా దేశాల హాకీ సమరం.. భారత జట్టు ప్రకటన

**హైదరాబాద్ పెన్ పవర్:** వచ్చే నెలలో భారత్ వేదికగా జరగనున్న మహిళల ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ కోసం హాకీ ఇండియా(%ఎశీఎవఎ ×అఎఖు%) జట్టును ప్రకటించింది. సలీమా టెటే నాయకత్వంలో 18 మంది సభ్యులతో కూడిన జట్టును ఆసియా సమరానికి ఎంపిక చేసింది. నవనీత్ కౌర్ డిప్యూటీగా వ్యవహరించనున్నారు. గోల్ కీపర్లుగా సవిత, బిచు దేవి ఖరీబామ్ ఎంపికయ్యారు.

నవంబర్ 11 నుండి 20 వరకు బీహార్‌లోని రాజ్‌గిర్ హాకీ స్టేడియం వేదికగా ఈ టోర్నమెంట్ జరగనుంది. గత ఎడిషన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా అవతరించిన భారత్.. భారీ అంచనాలతో బరిలోకి దిగింది. ఒలింపిక్ రజత పతక విజేతలైన చైనా, జపాన్, కొరియా, మలేషియా, థాయ్‌లాండ్ జట్ల నుంచి గట్టి పోటీని ఎదుర్కోనుంది.

ట్రోఫీని కాపాడుకోవడమే తమ ప్రధాన ధ్యేయమని కెప్టెన్ సలీమా చెప్పుకొచ్చింది. నవంబర్ 11న భారత జట్టు తమ తొలి మ్యాచ్‌లో మలేషియాతో తలపడనుంది.

ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీకి భారత హాకీ జట్టు:

గోల్ కీపర్లు: సవిత, బిచ్చు దేవి ఖరీబామ్





డిఫెండర్లు: ఉదిత, జ్యోతి, వైష్ణవి విఠల్ ఫాల్కే, సుశీల చాను పుఖ్రంబం, ఇషికా చౌదరి

మిడ్‌ఫీల్డర్లు: సలీమా టెటే(కెప్టెన్ ), నేహా, షర్మిలా దేవి, మనీషా చౌహాన్, సునేలితా టోప్పో, లాల్‌రెమ్సియామి

ఫార్వర్డ్‌లు: నవనీత్ కౌర్, ప్రీతి దుబే, సంగీత కుమారి, దీపిక, బ్యూటీ డంగ్‌డంగ్.

# కివీస్‌తో భారత్ మూడో టెస్ట్.. 24 ఏళ్ళ తర్వాత ప్రమాదంలో మరో రికార్డ్





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, న్యూజిలాండ్ మధ్య శుక్రవారం (నవంబర్ 1) నుంచి మూడో టెస్ట్ ప్రారంభం కానుంది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనుంది. భారత్ కు షాక్ ఇచ్చి న్యూజిలాండ్ ఇప్పటికే సిరీస్ కైవసం చేసుకుంది. మరో టెస్ట్ మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0 తేడాతో టీమిండియాపై నెగ్గి 12 ఏళ్ళ తర్వాత భారత గడ్డపై టెస్ట్ సిరీస్ గెలిచిన తొలి జట్టుగా నిలిచింది. బెంగళూరులో జరిగిన తొలి టెస్టులో 8 వికెట్ల తేడాతో గెలిచిన న్యూజిలాండ్.. పూణే వేదికగా జరిగిన రెండో టెస్టులో 113 పరుగుల తేడాతో విజయం సాధించింది.

సిరీస్ లోని చివరిదైన మూడో టెస్ట్ లోనూ గెలిచి న్యూజిలాండ్ క్లీన్ స్వీప్ చేయాలని భావిస్తుంది. వరల్డ్ టెస్ట్ చాంపియన్స్ షిప్ లో ఈ మ్యాచ్ ఇరు జట్లకు కీలకం. ఈ మ్యాచ్ లో కివీస్ గెలిస్తే భారత సుదీర్ఘ రికార్డ్ బ్రేక్ చేస్తుంది. సొంతగడ్డపై భారత్ చివరిసారిగా 2000 సంవత్సమలో సిరీస్ కోల్పోయింది. సౌతాఫ్రికాపై భారత్ 2000 సంవత్సరంలో సచిన్ టెండూల్కర్ కెప్టెన్సీలో 0-2 తేడాతో ఓడిపోయింది. ముంబైలో జరిగిన మ్యాచ్ లో నాలుగు వికెట్లు తేడాతో ఓడిన భారత్.. ఆ తర్వాత బెంగళూరు టెస్టులో ఇన్నింగ్స్ 71 పరుగుల తేడాతో ఓడిపోయింది. భారత్ గడ్డపై టీమిండియాను క్లీన్ స్వీప్ చేసిన చివరి జట్టు సౌతాఫ్రికా. 24 ఏళ్ళ తర్వాత కివీస్ కు వైట్ వాష్ చేసే అవకాశం వచ్చింది. మూడు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ విషయానికి వస్తే.. చివరిసారిగా 1997లో శ్రీలంకపై భారత్ ఒక్క మ్యాచ్ కూడా గెలవలేకపోయింది. 12 ఏళ్ళ తర్వాత భారత గడ్డపై సిరీస్ గెలిచి మన జట్టు జైత్రయాత్రకు బ్రేక్ వేసిన న్యూజిలాండ్.. 24 ఏళ్ళ రికార్డ్ బ్రేక్ చేస్తే భారత్ కు ఘోర అవమానం తప్పదు. ఈ టెస్ట్ కూడా ఓడిపోతే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ అవకాశం సంక్లిష్టం అవుతాయి.

# లక్కీ మీనాక్షి.. ఇంతగా గ్లామర్ డోస్ పెంచితే ఎలా?



ఈ షో-స్టాపింగ్ డ్రెస్‌లో తేజస్వి ప్రకాష్ వావ్

**హైదరాబాద్ పెన్ పవర్:** టాలీవుడ్ లో ప్రస్తుతం సెన్సేషన్ బ్యూటీ మీనాక్షి చౌదరి తన లేటెస్ట్ ఫోటో షూట్ తో ఫ్యాన్స్ ను ఎంతగానో ఆకట్టుకుంటోంది. తన గ్లామర్ తో ఎప్పుడూ వార్తల్లో నిలిచే ఈ బ్యూటీ, గ్లామరస్ డ్రెస్ లో స్టైలిష్ లుక్ తో స్టన్ అయ్యేలా స్టిల్ ఇచ్చింది. లక్కీ భాస్కర్ ప్రమోషన్స్ లో భాగంగా అమ్మడు ఈ విధంగా దర్శనమిచ్చింది. ఈ ఫోటోలలో మీనాక్షి చౌదరి అద్దం ముందు తన స్టైల్ లో నిలబడి, అద్భుతమైన ఫొటోషూట్ కోసం ఫోజులు ఇస్తోంది. సింపుల్ మరియు ఎలిగెంట్ లుక్ లో కనిపిస్తున్న మీనాక్షి, గ్లామరడ్ దుస్తులలో మరింత ఘాటుగా కనిపిస్తూ అభిమానులను అలరిస్తోంది. ఆమె పొడవాటి జుట్టు, ఆకర్షణీయమైన చిరునవ్వు తో ప్రతి ఫొటోలో ఒక ప్రత్యేకమైన ఆకర్షణను తీసుకొస్తున్నాయి. ఈ ఫోటోలకు సంబంధించిన ప్రదేశం దుబాయ్ అని మీనాక్షి తన ఇన్‌స్టాగ్రామ్ లో పేర్కొంది. దుబాయ్ లో తన అనుభవం ఎంతో మధురంగా ఉన్నట్టు కామెంట్ చేసింది.



ఈ ఫోటోలలో ఆమెతో పాటు హీరో దుల్కర్ సల్మాన్ కూడా కనిపిస్తున్నారు. ఈ ఫోటోలకు సూపర్ రిస్పాన్స్ రావడంతో పాటు, అభిమానులు మీనాక్షి స్టైలింగ్, గ్లామర్ పైన తమ అభిప్రాయాలను కామెంట్స్ రూపంలో వ్యక్తం చేస్తున్నారు. మీనాక్షి చౌదరి, మాలీవుడ్ స్టార్ హీరో లక్కీ భాస్కర్ సరసన ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తోంది. దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న ఈ సినిమా విడుదల కానుంది. ఈ మూవీలో మీనాక్షి పాత్రకు మంచి స్కోప్ ఉందని, ఆ పాత్ర ద్వారా తన గ్లామర్ తో పాటు నటనా ప్రతిభను కూడా చూపించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటి వరకు విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ ద్వారా ఫ్యాన్స్ అంచనాలు మరింత పెరుగుతున్నాయి. ఇలాంటి గ్లామరస్ మరియు స్టైలిష్ లుక్స్ తో మీనాక్షి చౌదరి ప్రతి ఫోటోలో తన ప్రత్యేకతను చూపిస్తోంది. టాలీవుడ్ లో స్టార్ హీరోల సరసన అవకాశాలు అందుకుంటున్న ఈ అందాల భామకి లక్కీ భాస్కర్ చిత్రం బిగ్ సక్సెస్ ను అందిస్తుందో లేదో చూడాలి.



రష్మీ గౌతమ్ లుక్ అంతా టైమ్‌లెస్ స్టైల్‌కి సంబంధించినది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com